

ప్రైవేట్ స్కూల్ వాహనాల అడ్డగింత

ప్రభుత్వ పాఠశాలలలోనే చదువుకోవాలని ఎలికట్టె గ్రామవాసులు, విద్యార్థులు ప్రైవేట్ స్కూల్ వాహనాలను అడ్డుగించారు. - 8లో



యాదాద్రి పునర్నిర్మాణం అద్భుతం

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం అద్భుతం అని జీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 31°/26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

6న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

నల్లగొండ టూటౌన్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ నెల 6న నల్లగొండలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించేందుకు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లనున్నట్లు పార్టీ నాయకులు బుధవారం తెలిపారు. నల్లగొండలో బహిరంగ సభ నిర్వహించే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు.

గుత్తాను కలిసిన కలెక్టర్ కర్ణన్



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ టూటౌన్: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వీ.కర్ణన్ బుధవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని నల్లగొండలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అదేవిధంగా కొత్తగా విధుల్లో చేరిన అదనపు కలెక్టర్ హేమంత్‌పాటిల్ గుత్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు, అదనపు కలెక్టర్‌కు గుత్తా అభినందనలు తెలిపారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

నల్లగొండ: ఎన్నికల బదిలీల్లో భాగంగా వివిధ జిల్లాల నుంచి బదిలీపై నల్లగొండ జిల్లాకు వచ్చిన 22 మంది తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ పోస్టింగ్‌లను కేటాయించారు. కట్టంగూర్‌కు దొంతెన స్వప్న, పెద్దఅడిశర్లపల్లికి ఎ.అండాలు, తిప్పర్తికి శ్రీనివాస్, శాలిగౌరారానికి బి.పాల్ సింగ్, నాంపల్లికి జి.దేవసింగ్, గుండ్లపల్లికి ఎస్.పురుషోత్తం, వేములపల్లికి బి.విజయలక్ష్మి, మిర్యాలగూడకు చంద్రశేఖర్‌గౌడ్, మర్రిగూడకు మహేందర్‌రెడ్డి, చింతపల్లికి అబ్దుల్ రహమాన్‌ఖాన్, గుర్రంపోడుకు మహ్మద్ తఖీ అహ్మద్, తిరుమలగిరిసాగర్‌కు యాదగిరి, దేవరకొండకు జి.సంతోష్‌కిరణ్, మాడ్గులపల్లికి ఎస్.జమీరోద్దీన్, నార్కట్‌పల్లికి జె.కార్తిక్, త్రిపురారం జయశ్రీ, నల్లగొండ కె.దామోదర్‌రావు, దామరచర్ల రాజేశ్వరి, చండూరు శ్రీనివాస్‌శర్మ, చిట్యాల జి.దశరథ, కనగల్ జి.జ్యోతి, నిడమనూరుకు శ్రీధర్‌ను కేటాయించారు.

ఏడు కొత్త వాహనాలు



జిల్లాకు వచ్చిన వాహనాలు

నల్లగొండ టౌన్: ఆపదంలో ఉన్నవారికి సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కొనుగోలు చేసిన 108, 102 వాహనాల్లో జిల్లాకు ఏడింటిని కేటాయించింది. వీటిలో 6 కొత్త 102 వాహనాలతో పాటుగా పార్థివదేహాలను తరలించే మరో వాహనాన్ని అప్పగించింది. వీటిని బుధవారం జీజీహెచ్ ఆవరణలో ఉంచారు. త్వరలోనే వీటిని ఆయా కేంద్రాలకు పంపించనున్నారు.

34 మంది టీచర్ల సర్దుబాటు

నల్లగొండ: జిల్లాలో 34 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జూమ్ మీటింగ్‌లో పాఠశాల విద్యా డైరెక్టర్ ఆదేశాలతోపాటు కలెక్టర్ అనుమతితో పిల్లల సంఖ్య కంటే ఉపాధ్యాయులు అధికంగా ఉన్న పాఠశాలల నుంచి అవసరం ఉన్న పాఠశాలలకు తాత్కాలిక పద్ధతిన సర్దుబాటు చేశారు. అయితే ఆయా పాఠశాలలకు తాత్కాలిక పద్ధతిన సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు హాజరయ్యే విధంగా మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు చూడాలని సూచించారు. ఉత్తర్వులు అమలు చేయని వారిపై సీసీఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-3 ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న మైనార్టీ అభ్యర్థులకు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విజయేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును ఈనెల 6లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారు పూర్తి వివరాలకు సెల్ : 9494345471, 7981196060 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేదల స్థలమూ కబ్జే..!

- మిర్యాలగూడ ఇందిరమ్మ కాలనీలో యథేచ్ఛగా భూబాగోతం
- తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ పట్టాలు సృష్టించి..
- అమాయకులకు ప్లాట్లు విక్రయిస్తున్న ఓ నాయకుడు
- చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న యంత్రాంగం

మిర్యాలగూడ: ప్రభుత్వ భూములే కాదు.. పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన ప్లాట్లను సైతం అక్రమార్కులు వదలట్లేదు. మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఖాళీగా ఉన్న ప్లాట్లను నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించిన భూబాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇచ్చిన స్థలాలను అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు.. ఇక్కడనుంచి బదిలీపై వెళ్లిన పలువురు తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ ఇంటి పట్టాలను సృష్టించి అమాయకులకు ప్లాట్లను విక్రయించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత అవినీతి జరుగుతున్నా, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నా అధికారులు మాత్రం మౌనం వీడడం లేదు.

వారసులు లేనివారి ప్లాట్లను యథేచ్ఛగా..

ఇతను పంపిణీ చేసే నకిలీ పట్టాల్లో ఓ వ్యక్తికి 2017లో పెండ్లి అయితే అతని భార్య పేరు మీద 2013లోనే పట్టా తీసుకున్నట్లు సృష్టించడం అతనికే చెల్లింది. అంతేకాకుండా 2009లో పట్టా వచ్చినట్లు నకిలీ పట్టాను సృష్టించి విక్రయించగా ఆ ప్లాటు ఎక్కడ ఉందో కొనుగోలు చేసిన వారికి అర్థంకాని పరిస్థితి. ప్లాటు కొన్నప్పుడు ఒక స్థలాన్ని చూపగా



2009లో తహసీల్దార్ సంతకంతో జారీ అయిన పట్టా

ఆ తర్వాత ఆ ప్లాటు తమది కాదని తెలుసుకున్న కొనుగోలు దారులు ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలోపడ్డారు. అంతేకాకుండా ఇందిరమ్మ ప్లాట్లు పొందిన వారిలో వారసులు లేని 30మంది ప్లాట్లను వారు చనిపోయిన తర్వాత నకిలీ పట్టాలను సృష్టించి మరీ యథేచ్ఛగా విక్రయిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. మిర్యాలగూడ తహసీల్దార్‌గా రమాదేవి 2011–14 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. కానీ, 2009లో తహసీల్దార్ రమాదేవి సంతకం చేసినట్టుగా పట్టా సృష్టించడం కొసమెరుపు. అయితే ఆమె సంతంక ఫోర్జరీ చేసి పట్టాలు సృష్టించి ప్లాట్లను అమ్మకాలు చేపట్టినట్లు పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ భూదందాపై అధికారులు దృష్టిసారించి తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంతకాలు ఫోర్జరీ చేస్తే క్రిమినల్ చర్యలు



నకిలీ పట్టాలు సృష్టించి మిర్యాలగూడ ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలను విక్రయిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. లిఖిత పూర్వకంగా మాకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసినట్లయితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారినైనా ఉపేక్షించం.

– అనిల్‌కుమార్, తహసీల్దార్, మిర్యాలగూడ

ఖాళీగా ఉన్న ప్లాట్లపై కన్ను..

గత ప్రభుత్వాలు మిర్యాలగూడలోని ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇళ్ల ప్లాట్లను మంజూరు చేశాయి. అప్పటి పరిస్థితుల్లో కొందరు అక్కడ నివాసం ఉండలేక తక్కువ ధరలకు ప్లాట్లను అమ్ముకున్నారు. వీరికి కేటాయించిన ప్లాట్లు కాకుండా ఇంకా పెద్ద మొత్తంలో ఖాళీ ప్లాట్లు ఇక్కడ మిగిలి ఉన్నాయి. వీటిపై సదరు అధికార పార్టీ నాయకుడి కన్ను పడింది. దీంతో తన కబ్జా బాగోతానికి తెరలేపాడు. ఏ ప్లాటు అయితే ఖాళీగా ఉందో ఆ ప్లాట్‌ను విక్రయించేందుకు తన అనుచరవర్గ సహకారంతో పావులు కదిపాడు. 2011–13 మధ్యకాలంలో ఇక్కడ పనిచేసిన పలువురు తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి ఇంటి పట్టాలు సృష్టించాడు. అంతటితో ఆగక ఆయా ప్లాట్లను అధిక ధరలకు విక్రయించాడు. పేరుకు మాత్రం పేదోళ్లకు పట్టాలు ఇప్పిస్తున్నానని నమ్మిస్తూ ప్రజలను, అధికారులను పక్కదోవ పట్టించాడు. దాదాపు 20 నుంచి 30 వరకు నకిలి ఇంటి పట్టాలను సృష్టించి విక్రయించినట్లు తెలుస్తోంది. ఇతడు. సాగర్ రోడ్డులో ఉన్న ఓ కంప్యూటర్ కేంద్రాన్ని అడ్డాగా చేసుకొని నకిలీ పట్టాలు సృష్టించి ఇళ్ల స్థలాలను విక్రయిస్తున్నట్లుగా పలు ఆరోపణలు ఉన్నాయి.

బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలి



ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అధికారులు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కర్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. నల్లగొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటరు నమోదు, ఎన్నికల విభాగం అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 21న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. జాబితాలో అభ్యంతరాలు లేదా మార్పులు చేయాల్సి ఉంటే ఈ నెల 21నుంచి సెప్టెంబర్ 19వ తేదీ వరకు పూర్తి చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఆగస్టు 26, 27 సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తామన్నారు. ఓటరు తుది జాబితాను అక్టోబర్ 4వ తేదీన విడుదల చేస్తామని కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో మొత్తం ఆరు నియోజకవర్గాలు ఉండగా, 1,747 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాము, సీసీ కెమెరా నిఘా, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బక్క పిచ్చయ్య, పోతెపాక లింగస్వామి, గుమ్ముల మోహన్‌రెడ్డి, నర్సిరెడ్డి, వంటెపాక యాదగిరి, బి.మల్లికార్జున్, షేక్ మోయిన్, కుతుబుద్దీన్, రవి, చెన్నయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

తెలంగాణకు హరితహారం, తెలంగాణ క్రీడా ప్రాంగణంలు, పల్లె ప్రగతి పనులు లక్ష్యం మేరకు త్వరగా పూర్తి చేయాలనికలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తి చేసిన క్రీడాప్రాంగణాలకు స్పోర్ట్స్ కిట్, టీ షర్ట్‌లు అందిస్తామన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కర్ణన్

ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరణ

ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ వివరాలు ఆగస్టు–5 వరకు పంపాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటా ఇన్నోవేషన్ -2023 పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య వేడుకల్లో ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆవిష్కరణల వివరాలను సెల్ నంబర్ 9100678543కు వాట్సాప్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ శ్రీనివాస్, మీ సేవ ఏఓ.రాజశేఖర్, ఈడీఎం ఎన్.సాయికుమార్ పాల్గొన్నారు.

దేవరకొండ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలి

- రవీంద్రకుమార్ వ్యతిరేక వర్గీయుల సమావేశంలో తీర్మానం

డిండి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను మార్చి దేవరకొండ మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్‌ను ప్రకటించాలని ఎమ్మెల్యే అసమ్మతి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డిండి మండలం రుద్రాయగూడెంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ వ్యతిరేక వర్గానికి చెందిన దాదాపు 70 మంది బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అసమ్మతి సమావేశంలో ఏకగ్రీవం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఒంటెద్దు పోకడతో బీఆర్‌ఎస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా చూసే నాయకులను ఎమ్మెల్యే ఇబ్బందులు పెడుతూ అవమానాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వడ్త్య దేవేందర్‌నాయక్‌కు బీఆర్‌ఎస్ తరఫున టికెట్ ఇస్తే దేవరకొండ ఖిల్లాపై మరోసారి గులాబీ జెండా ఎగరవేస్తామని, లేని పక్షంలో తాము వేరే దారి వెతుక్కోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జాన్‌యాదవ్, సీనియర్ నాయకులు రాఘవేందర్ రావు, యాదగిరిరావు, దశరథ్‌రెడ్డి, కృష్ణారావు, రాజేందర్‌రెడ్డి, నూకం వెంకటేష్,చంద్రారెడ్డి, సర్పంచ్‌లు దామోదర్‌రావు, ఇందిరా భాస్కర్‌రెడ్డి, భాస్కర్, సుధామణీవెంకట్‌రెడ్డి, అలివేలు మాధవయ్య, ఆంజనేయులు, లక్ష్మీవెంకట్రాం, నరేష్, ఎంపీటీసీ రజిత హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు

కళ్ల కలకపై జాగ్రత్త

నల్లగొండ టౌన్: కళ్ల కలక పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ అనిమళ్ల కొండల్ రావు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. కళ్ల కలక బారిన పడ్డవారు డాక్టర్‌ను సంప్రదించి వారి సూచనలు పాటిస్తూ మందులు వేసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలోనే వ్యాపించే దీనిపై నిర్లక్ష్యం చేస్తే కంటిచూపు పోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఈ వ్యాధి అన్ని వయస్సుల వారికి సోకుతుందని, ఇప్పటికే జిల్లాలోని ఆస్పత్రుల్లో కేసుల నమోదు అవుతున్నాయని తెలిపారు. కళ్ల కలక వస్తే కళ్ల నుంచి నీరు కారడం, మంట, దురద, కనురెప్పలు ఉబ్బిపోవడం, కళ్లలోంచి చీము కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 13 మొబైల్ వాహనాల్లో ఇద్దరు డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఫార్మసిస్టులను నియమించామని, విద్యాసంస్థలో బాధిత విద్యార్థులకు మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 08682 295210 ఫోన్ చేయాలని కోరారు.

సర్వేయర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: సర్వేయర్లు క్షేత్రస్థాయిలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఆర్డీఓలు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, సర్వేయర్లు, డీఆర్‌డీఏ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 306 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాల కేటాయింపు పెండింగ్‌లో ఉండడంపై సర్వేయర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పంచాయతీల్లో మండల అధికారులత సహకారంతో పూర్తిచేసి సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీకి నివేదికలు సమర్పించాలని సర్వేయర్లను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చే భూ సంబంధిత దరఖాస్తులపై 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేసి రిపోర్టులను సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీకి పంపించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు రవి, చెన్నయ్య, రాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏఈ శ్రీనివాస్, డీఆర్‌డీఓ కాళిందిని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పాల్గొన్న అధికారులు

మద్యం టెండర్లకు రెడీ

- ఉత్తర్వులు జారీ చేసిన ఎక్సైజ్ శాఖ
- నేడు ఎస్సీ, ఎస్టీ, గౌడ్‌లకు కేటాయించే షాపులకు డ్రా
- 4న వెలువడనున్న నోటిఫికేషన్
- 18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 21న లాటరీ ద్వారా మద్యం షాపుల కేటాయింపు
- డిసెంబర్ 1న నూతన షాపులు ప్రారంభం

నల్లగొండ క్రైం: మద్యం దుకాణాల టెండర్లకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సిద్ధమైంది. రెండేళ్ల కాల పరిమితికి (2023–25 సంవత్సరాలకు) గాను జిల్లాలో 155 మద్యం దుకాణాలకు టెండర్లకు బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. 4న గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. దీంట్లో భాగంగా ఈనెల 3న (గురువారం) జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ అధికారి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల అధికారుల సమక్షంలో ఆయా సామాజిక వర్గాలకు రిజర్వేషన్ ప్రాతిపదికన మద్యం దుకాణాలు నిర్ధారించేందుకు డ్రా నిర్వహించనున్నారు. 155 మద్యం షాపుల్లో గౌడ్‌లకు 34, ఎస్సీ 14, ఎస్టీ 4 షాపులు మొత్తం 52 షాపులను రిజర్వేషన్ పద్ధతిన ఎంపిక చేస్తారు. మిగిలిన 103 మద్యం షాపులను జనరల్ స్థానాలుగా కేటాయించారు. అయితే అన్ని షాపులకు రిజర్వేషన్ కేటగిరీలకు సంబంధించిన వారు టెండర్ వేయవచ్చు. డిసెంబర్ 1 నుంచి కొత్తషాపులు ప్రారంభించేందుకు టెండర్ నోటిఫికేషన్‌లు వేస్తున్నారు.

దరఖాస్తు ఇలా..

మద్యం దుకాణాలకు టెండర్ వేసే అభ్యర్థులు దరఖాస్తు వెంట ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, రూ.2లక్షల డీడీ, చెక్కును జతచేయాలి. డిఫాల్టర్‌లు ఆర్థికంగా దివాలా తీసినవారు టెండర్‌కు అనర్హులు, 21 సంవత్సరాల్లోపు ఉన్న వారు మద్యం టెండర్ వేయరాదు.

గతంలో రూ.80కోట్ల ఆదాయం

2019–21లో 155 మద్యం షాపులకు నిర్వహించిన మద్యం దుకాణాలకు జిల్లా వ్యాప్తంగా 4వేల దరఖాస్తులు అందాయి. వీటి ద్వారా రూ.80 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరింది. అత్యధికంగా తుమ్మడం గ్రామంలోని మద్యం షాపుపై 130 దరఖాస్తులు రాగా ద్వితీయ స్థానంలో దర్వేశిపురం మద్యం షాపుకు 77 దరఖాస్తులు అందాయి. ఈసారి ఎన్నికల సమయం కావడంతో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు టెండర్ దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ అధికారులు అంటున్నారు. గతం తరహాలోనే మళ్లీ తుమ్మడం, దర్వేశిపురంలో మద్యం షాపులను దక్కించుకునేందుకు అధికంగా టెండర్లు వేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నోటిఫికేషన్‌కు అంతా సిద్ధం చేశామని కలెక్టరేట్‌లో ఈనెల 3న రిజర్వేషన్ షాపులను నిర్ధారించేందుకు డ్రా ఎంపిక చేస్తామని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.



18వరకు దరఖాస్తుల గడువు

అయితే ఈ నెల 4న మద్యం టెండర్లకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. పని దినాల్లో టెండర్ దరఖాస్తులను తీసుకుంటారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం టెండర్ దరఖాస్తును అందజేయాలి. ఈనెల 21న డ్రా ద్వారా ఎంపిక చేస్తారు. టెండర్ లభించినవారు 21, 22 తేదీల్లో మొదటి దశ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. నవంబర్ 30న టెండర్ పొందినవారికి మద్యం సరఫరా చేస్తారు. డిసెంబర్ 1న నూతన మద్యం షాపులు ప్రారంభించాల్సి ఉంటుంది.

నులి పురుగులకు చెక్ పెట్టేలా..

- ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్
- నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- పందొమ్మిది సంవత్సరాలలోపు వారికి వేసేలా ఏర్పాట్లు

పెద్దవూర: ఆడుతూ పాడుతూ ఆనందంగా గడపాల్సిన చిన్నారుల జీవితాన్ని నులి పురుగులు నులిమేస్తున్నాయి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఈ నులిపురుగుల కారణంగా పిల్లలు తరచూ అనారోగ్యాలతో, అలసటతో ఉంటారు. దీంతో చదువులపై దృష్టి కేంద్రీకంచరు. ఈ ప్రభావంతో పాఠశాలల్లో గైర్హాజరీ 25శాతం పైగా ఉంటుందని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పిల్లలలో అనేక అనారోగ్యాలకు కారణమవుతున్న నులిపురుగులను అల్బెండజోల్ అనే కేవలం ఒకే మాత్రతో నివారించవచ్చు. ఈ నేథ్యంలో ఏటా ఆరోగ్యశాఖ ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది. జాతీయ నులిపురుగుల నిర్మూలన కోసం ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగస్టు మాసాల్లో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. దీంట్లో భాగంగా జిల్లావ్యాప్తంగా గురువారం ఒక్క రోజు మాత్రమే మిర్యాలగూడ డివిజన్ పరిధిలో 98,915 మంది, అలాగే నల్లగొండ, దేవరకొండ డివిజన్ల పరిధితో కలుపుకొని మొత్తం 3.50లక్ష మంది పిలలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి జాతీయ నులిపురుగుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

నులిపురుగులు అంటే..

నులిపురుగులు అనేవి మానవులలో ప్రేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. ఇవి చిన్నారుల రక్తహీనతకు దారి తీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారతాయి. కడుపులో చేరి నొప్పి, మంట, వికారం కలుగ జేస్తాయి. దీని వలన ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరస పడుతారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం , అతిసారం వంటి సమస్యలు ప్రబలుతాయి. ఏడాది నుంచి పంతొమ్మిది ఏళ్ల పిల్లల్లో నులి పురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.

ఇలా నివారించవచ్చు..

పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలిక పాములు, నులిపురుగులు, కొంకి పురుగులు. వీటిని నిర్మూలించేందుకు అల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలి. మాత్రను భోజనం చేసిన తర్వాతనే వేసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒకరోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి.



పెద్దవూర : విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం (ఫైల్)

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకూడదు. మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. పండ్లు, కాయగూరలను శుభ్రంగా కడిగిన పిదప మాత్రమే వినియోగించుకోవాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లలకు నులి పురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.

మాత్రల డోస్ ఇలా..

- 1 నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు సగం (అర) ఆల్బెండజోల్ మాత్రను పొడి చేసి పాల ద్వారా గానీ నీళ్ల ద్వారా గానీ మింగించాలి.
- 2 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు ఒక మాత్రను పొడి చేసి నీళ్ల ద్వారా మింగించాలి.
- 3 నుంచి 19 ఏళ్లలోపు వారు మధ్యాహ్న భోజనం తర్వాత మాత్రను నమిలి మంచి నీటితో మింగాలి.
- ఇది నేరుగా మింగే మాత్ర కాదు. నోట్లో వేసుకుని చప్పరించినా లేదా నమిలి మింగినా సరిపోతుంది.

రూ.లక్ష రుణమాఫీకి ఉత్తర్వులు

నల్లగొండ టౌన్: ఈ నెల 3వ తేదీ నుంచి రూ.లక్ష రుణ మాఫీ ప్రక్రియను ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు అధికారులకు ఉత్తర్వులు జారీ చేయడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే రూ.25వేల వరకు రుణాలు తీసుకున్న 1.20లక్షల మందికి మాఫీ చేశారు. కాగా రూ.50వేల పైచిలుకు రుణాలు తీసుకున్న రైతులు మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులతో జిల్లాలో 1.30లక్షల మంది వరకు మేలు జరగనుంది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. ఫోన్‌లో లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసి రుణాలు పొందడం లాంటివి చేయొద్దని సూచించారు. డబ్బులు తిరిగి చెల్లించకపోతే మీ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం అంతా రుణం ఇచ్చేవారు ఆధీనంలోకి తీసుకొని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్, జూదం, ఆడరాదని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ 1930కి గాని, 155260కి గాని కాల్ చేసి వివరాలు తెలపాలని కోరారు.

క్లుప్తంగా

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 6 నెలల కాలపరిమితి గల ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ, లేదా డిప్లమా, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలన్నారు. అలాగే టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు మాత్రం 8వ తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 18నుంచి 25ఏళ్ల లోపు వయస్సు కల్గి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ ఫొటోలతో ఈ నెల 16న సంస్థలో నిర్వహించే అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 913390 8222 నంబర్లను సంప్రదించాలన్నారు.

గాయపర్చిన వ్యక్తికి జైలు

నిడమనూరు: ముగ్గురిని గాయపర్చిన కేసులో నిందితుడికి నిడమనూరు కోర్టు జడ్జి స్వప్న నెల రోజుల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. తిరిమలగిరి మండలం చింతల పాలెం గ్రామానికి చెందిన జడల కాశయ్య 2017 జనవరి 22వ తేదీన సాయంత్రం పైలాన్ కాలనీకి చెందిన దేశబోయిన ఉష ఇంట్లో దూరి పని మనిషి ఖదిర్‌ను గాయపర్చాడు. అడ్డు కోబోయిన ఉష నుదిటిపై కత్తితో గాయపర్చి వెళ్తుండగా అడ్డుగావచ్చిన మరో పనిమనిషి స్వర్ణలతను సైతం గాయపర్చి పరారయ్యాడు. కాశయ్య చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన కారణంగా దేశబోయిన ఉష ఇంట్లో ఉంటూ పెరిగి పెద్దవాడు కాగా వివాహం జరిపించారు. వేరేగా ఉంటూ అకారణంగా ముగ్గురిని గార్చాడని విజయపురి(టీ) పోలీస్ స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు ఇవ్వగా అప్పటి ఎస్ఐ గౌరి నాయుడు కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువు కావడంతో నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని లేదా వెయ్యి రూపాయల జరిమానా చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారని కోర్టు లైజన్ ఆఫీసర్ అలీ మహ్మద్ తెలిపారు.

త్వరలో ఆపరేషన్.. అంతలోనే మృత్యువాత

- కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు, బంధువులు
- చౌటుప్పల్ పట్టణంలో విషాదం



నాగేష్ (ఫైల్)

చౌటుప్పల్ : కొద్ది రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న యువకుడికి అతి త్వరలోనే ఆపరేషన్ జరగాల్సి ఉంది. కానీ అంతలోనే ఆకస్మికంగా మృత్యువాతపడ్డాడు. ఈ హృదయ విదారకర ఘటన బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. చౌటుప్పల్‌లోని గాంధీపార్కుకు చెందిన బాలగోని నాగేష్(38) స్థానికంగా రిఫ్రిజరేటర్ షాప్ నిర్వహిస్తున్నాడు. నాగేష్‌కు కొద్ది రోజుల క్రితం కిడ్నీ సమస్య తలెత్తింది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డయాలసీస్ చేయించుకుంటున్నాడు. కుమారుడికి కిడ్నీ ఇచ్చేందుకు తల్లి దేవకమ్మ ముందుకు వచ్చింది. అందుకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు సైతం పూర్తయ్యాయి. కిడ్నీ మార్పిడి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత కుటుంబ సభ్యులకు నిమ్స్ ఆస్పత్రి వైద్యులు సైతం సూచించారు. అందులో భాగంగా ఈనెల 10 లేదా 12న ఆపరేషన్ నిర్వహించేందుకు వైద్యులు నిర్ణయించారు. ఆ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక నాగేష్‌కు అకస్మాత్తుగా శ్వాస సంబంధిత ఇబ్బంది తలెత్తింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించి ఆక్సిజన్ పెట్టారు. అనంతరం మెరుగైన వైద్య కోసం హైదరాబాద్ తీసుకువెళ్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతిచెందాడు. త్వరలోనే ఆపరేషన్ జరిగితే సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మారి కలిసిమెలిసి తమ మధ్య తిరుగుతావనుకుంటే కానరాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ భార్యాపిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన నిందితుల కారు



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు

- రెండు కార్లలో మహారాష్ట్రకు సరఫరా
- టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు
- అప్పటికే తప్పించుకున్న మరో కారు
- నాలుగు కిలోల గంజాయి, కారు, రూ.15వేల నగదు స్వాధీనం

చౌటుప్పల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు ప్రాంతం నుంచి మహారాష్ట్రకు గంజాయిని రవాణా చేస్తున్న ఇన్నోవా కారును పోలీసులు పట్టుకున్నారు. మరో కారు తప్పించుకొని పోయింది. ఈ ఘటన మంగళవారం మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. నిందితుల్లో ఒకరు తప్పించుకోగా ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కేసు వివరాలను సీఐ దేవేందర్ బుధవారం వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా పండరిపురం గ్రామానికి చెందిన జావెర్, జాదవ్ అజినాథ్‌తో పాటు అదే జిల్లాకు చెందిన గజిగేట్ ప్రమోద్‌లు వేర్వేరు పనులు చేసుకుంటున్నారు. వివిధ మార్గాల్లో వీరు మిత్రులుగా మారారు. చాలా కాలంగా గంజాయి రవాణా చేస్తున్న జావెర్‌తో కలిసి మిగతా ఇద్దరు కూడా చేతులు కలిపారు. ఆ క్రమంలో సీలేరులోని గంజాయి వ్యాపారుల వద్ద పొడి గంజాయి కొనుగోలు చేశారు. ఒక కారులో 47కిలోలు, మరో కారులో నాలుగు కిలోల చొప్పున ప్యాకెట్‌లుగా చేసి అక్కడి నుంచి బయలుదేరారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రెడ్డిబావి గ్రామ శివారులో తనిఖీలు చేపట్టిన పోలీసులకు ఇన్నోవా కారు చిక్కింది. అందులో నాలుగు కిలోల గంజాయి లభ్యమయ్యింది. అంతకు ముందే 47కిలోల గంజాయి కలిగిన కారు తప్పించుకుపోయింది. ఇన్నోవా కారులో ఉన్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రెండు ఫోన్లు, 15వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని కోర్టులో హాజరుపరిచారు. పట్టుబడిన సొత్తు విలువ 8లక్షల వరకు ఉంటుందని సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

సూర్యాపేట రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సూర్యాపేట, గరిడేపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన పల్లపు రాజు (25), పస్పుల నాగరాజులు ఇద్దరు కలిసి బైక్‌పై సూర్యాపేటకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. పిల్లలమర్రి స్టేజీ వద్దకు రాగానే సూర్యాపేటలో పని ఉండగా తిరిగి వెళ్లేందుకు పిల్లలమర్రి స్టేజీ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజు, నాగరాజుకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజును మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సాయిరాం తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..



ధనుంజయ్ (ఫైల్)

గరిడేపల్లి : మిర్యాలగూడకు చెందిన గువ్వ ధనుంజయ్య(53) హుజూర్‌నగర్‌లో ఇరిగేషన్ శాఖ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని హుజూర్‌నగర్ నుంచి తన బైక్‌పై మిర్యాలగూడకు వెళ్తున్నాడు. గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట శివారులో కంకర మిల్లు వద్ద చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన కాలపంగు కళ్యాణ్ గరిడేపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తూ ధనుంజయ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధనుంజయ్, కళ్యాణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ధనుంజయ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కళ్యాణ్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో బంగారు ఆభరణం పోగొట్టుకున్న భక్తుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి బుధవారం వచ్చిన ఓ భక్తుడు తన చేతికున్న బ్రాస్లెట్‌ను ఆలయంలో పాగొట్టుకున్నాడు. కరీంనగర్ జిల్లా కమలాపూర్‌కు చెందిన లింగమూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకునేందుకు సాయంత్రం ఆలయానికి వచ్చాడు. సుమారు సాయంత్రం 5.30గంటల సమయంలో స్వామివారిని దర్శనం చేసుకొని, ముఖ మండపంలో అష్టోత్తర పూజల్లో పాల్గొనేందుకు వెళ్లాడు. అప్పటి వరకు చేతికి ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు బ్రాస్లెట్ కనిపించలేదు. దీంతో అక్కడే ఉన్న ఆలయ, ఎస్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే దర్శనం క్యూలైన్ నిలిపివేసి, దర్శనానికి వచ్చిన భక్తులను క్యూలైన్‌లోనే ఎస్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేశారు. క్యూలైన్‌లో, ముఖ మండపంలో ఎక్కడ బ్రాస్లెట్ కనిపించకపోవడంతో వెంటనే భక్తుడు లింగమూర్తి, కుటుంబ సభ్యులు కొండపైనే గల కమాండ్ కంట్రోల్ గది వద్దకు వెళ్లి పోలీసుల సహకారంతో సీసీ ఫుటేజీలో పరిశీలిస్తున్నారు. భక్తుడు ఎస్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వలపు వల వేసి.. రూ.30లక్షలు కాజేసి..!

- ప్రేమ పేరుతో అమాయకుడిని మోసగించిన యువజంట
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- దంపతుల అరెస్ట్

పాలకవీడు: వ్యసనాలకు బానిసలైన యువ జంట.. ఓ అమాయకుడిని మోసగించి రూ.30 లక్షలు కాజేశారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకవీడు మండలం గూడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన సట్టు నారాయణ నేరేడుచర్లకు చెందిన గడ్డం భారతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. నారాయణ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతుంటాడు. వీరి అవసరాలకు, ఆన్‌లైన్ బెట్టింగులకు డబ్బు అవసరం కావడంతో అదే గ్రామానికి చెందిన దొంగల సతీష్ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసానికి తెరలేపారు. నారాయణ తన భార్య భారతిని సంధ్య అనే పేరుతో సతీష్‌కు పరిచయం చేశాడు. మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో సతీష్ వద్ద నుంచి డబ్బులు కాజేయడం మొదలు పెట్టారు. సతీష్‌ను బెదిరించి నాలుగేళ్లుగా సుమారు రూ.30 లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన సతీష్ పోలీసులను ఆశ్రయించాడు. జరిగినదంతా పోలీసులకు వివరించి నారాయణ, భరతిలపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు బుధవారం వారిని మిర్యాలగూడ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13వేల నగదు, బైక్ ఇతర సామగ్రి స్వాధీనపరుచుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు.

సీసీ ఫుటేజీ తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గత నెల 28, 29వ తేదీల సీసీటీవీ ఫుటేజీలను ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అహ్మద్ సేకరించి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి తోట భానుప్రసాద్ , మందిర అర్చక ప్రముఖ మదన్మోహన్‌లు అన్నారు. సీసీ ఫుటేజీ బయటకు తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం యాదగిరిగుట్ట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీ ఫుటేజీ బయటకు వచ్చిన సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో కర్రె ప్రవీణ్ చామ రవీందర్, కంసాని హరీష్ ఉన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ), చండూరు : ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి యువతిని మోసిగించిన యువకుడికి మహిళా కోర్టు జడ్జి బి.తిరుపతి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చండూరు మండల కస్తాల గ్రామానికి చెందిన ఓ యువతికి తల్లి లేకపోవడంతో అదే గ్రామంలో ఉంటున్న పెద్దమ్మ పెదనాన్నలు బొమ్మనబోయిన మల్లయ్య, జయమ్మ వద్ద ఉంటూ చదువుకుంటోంది. వీరి ఇంటి పక్కనే ఉంటున్న గంటా శంకర్ మర్రిగూడ మండలం వాయిలపల్లిలో మెడికల్ షాపు నడుపుతున్నాడు. ఏడాది కాలంగా స్నేహంగా ఉంటూ యువతితో పరిచయం పెంచుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చెబుతూ తరచూ వెంట పడ్డాడు. ఇదే క్రమంలో యువతికి సిమ్ కార్డు ఇచ్చి రోజు ఫోన్‌లో మాట్లాతుండేవాడు. కొన్ని రోజుల తర్వాత యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని విషయం శంకర్‌కు తెలిసింది. నన్ను కాదని వేరే వాళ్లని వివాహం చేసుకుంటే నీ అంతు చూస్తానని బెదిరించాడు. 2016 జూలై 11న ఫోన్ చేసి ఇంట్లో ఎవరికి తెలియయుండా పెళ్లి చేసుకుందామని చెప్పి తన వాయినపల్లిలోని అద్దె గదికి తీసుకెళ్లాడు. శారీరకంగా దగ్గరవడానికి ఒత్తిడి చేశాడు. యువతి అంగీకరించకపోవడంతో బెదిరించి లోబర్చుకున్నాడు. రెండు రోజులు గదిలో నిర్బంధించి భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా మానసికంగా చిత్ర హింసలకు గురి చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేయగా ఇద్దరు కలిసి బైక్‌పై దర్వేశిపురానికి బయలుదేరారు. మార్గ మధ్యలో బైక్ నుంచి కింద పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయంలో శంకర్ కుటుంబ సభ్యులకు తెలియడంతో ఇద్దరిని ఇంటికి తీసుకెళ్లారు. రెండు రోజుల తర్వాత శంకర్ కుటుంబ సభ్యులంతా యువతిని పెద్దమ్మ ఇంట్లో వదిలేసి వెళ్లిపోయారు. యువతి చండూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన అప్పటి సీఐ పి.రమేష్ కుమార్, ఎస్ఐ సురేష్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటమరణారెడ్డి వాదనలతో ఏకీభవించిన మహిళా కోర్టు జడ్జి బి.తిరుపతి అత్యాచారానికి పాల్పడినందుకు సెక్షన్ 376 ప్రకారం పదేళ్ల జైలు రూ. 10 వేల జరిమానా, గదిలో నిర్బంధించినందుకు గాను సెక్షన్ 342 కింద ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

చిన్నారిని బలిగొన్న నీటి సంపు

భూదాన్‌పోచంపల్లి : ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి ఓ చిన్నారి మృతి చెందింది.ఈ ఘటన భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంబా సింబు కుటుంబం ఉపాధి కోసం నెల రోజుల క్రితం దోతిగూడెం వచ్చారు. స్థానికంగా మోహన్‌రెడ్డికి చెందిన షెడ్‌లో తాత్కాలిక నివాసం ఉంటూ రోజువారీ కూలీ పనులకు వెళ్తుంటారు. బుధవారం సాయంత్రం సింబు కుమార్తె సుమిత్ర (5) ఆరుబయట ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత కుమార్తె కన్పించడంలేదని తల్లిదండ్రులు వెదకగా నీటి సంప్‌లో పడి చనిపోయి ఉంది. వెంటనే మృతదేహాన్ని బయటికి తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

డిండి: ఘర్షణలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. డిండి మండల పరిధిలోని ధాక్యాతండాకు చెందిన నేనావత్ కృష్ణ(55) ఇంట్లో మంగళవారం సాయంత్రం ఫోన్ చోరీకి గురైంది. తన ఫోన్‌ను అదే తండాకు చెందిన శ్రీను దొంగిలించాడన్న అనుమానంతో కృష్ణ అతడితో గొడవకు దిగాడు. ఇదే క్రమంలో మాటామాటా పెరగగంతో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో సీసీ రోడ్డుపై పడిన కృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే రాత్రి అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసామని సీఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.సైదులు తెలిపారు. మృతుడి అంత్యక్రియల సమయంలో తండాలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిట్టీల పేరిట మోసగించిన వ్యక్తికి జైలు

మిర్యాలగూడ టౌన్ : అనధికారికంగా చిట్టీలను నడుపుతూ మోసగించిన నిందితుడికి 8 నెలలు జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం మిర్యాలగూడ ఒకటవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సాయినాగ సుమబాల తీర్పునిచ్చారు. మిర్యాలగూడలోని హనుమాన్‌పేటకు చెందిన నీరుకంటి వెంకటకృష్ణ వద్ద పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన సలికంటి సైదులు 2015లో చిట్టీలో జాయిన్ అయ్యాడు. దీంతో చిట్టీ పాడుకున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2016 జూన్ 9న ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖల్ చేశాడు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో 8 నెలలు జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ సుధాకర్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు కానిస్టేబుల్ పెద్దిరెడ్డి సహకరించారు.

బార్‌లో దొంగతనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పరిధిలోని యాదాద్రి బార్‌లో దొంగతనం జరిగింది. బార్ నిర్వాహకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి 11గంటల సమయంలో పట్టణంలో నిర్వహిస్తున్న బార్‌ను నిర్వాహకులు మూసి ఇంటికి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వచ్చి బార్‌ను తిరిగి ఓపెన్ చేయగా కౌంటర్ తీసి, అందులో ఉన్న డబ్బులు దొంగిలించినట్లు కనిపించింది. అనుమానం వచ్చిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చి, బార్‌లో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించారు. గతంలో బార్‌లో పని చేసిన ఓ వ్యక్తి దొంగతనం చేసినట్లు నిర్ధారణ అయింది. కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.35వేలకు పైగా నగదును అపహరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ రమేష్ తెలిపారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

యాదగిరిగుట్ట: రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 8కోట్ల మంది రవాణా రంగంలో పనిచేస్తున్నారని, అందులో కొంతమంది నిత్యం ప్రమాదాలకు గురవుతూ చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 సంవత్సరంలో 1.54లక్షల మంది, గంటకు 17మంది చొప్పున కార్మికులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని తెలిపారు. ప్రమాదంలో మరణిస్తున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన మోటార్ వాహన చట్టం -2019 కార్మికులకు తీవ్ర నష్టం చేసే విధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని ఉపసంహరించే వరకు కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. యూనియన్ కేంద్ర కమిటీ సభ్యుడు కల్లూరి మల్లేశం అధ్యక్షత వహించిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ , రాష్ట్ర కోశాధికారి సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ బాబు, రుద్ర కుమార్, కోటయ్య, రాంబాబు, నాయకులు పున్నం రవి, సీహెచ్ రవికుమార్, విజేందర్, యండి పాషా, కువకుమారస్వామి, గోవర్ధన్, రాజమౌళి, నాగరాజు, శ్రీనివాస్, రాములు తదితరులున్నారు.

ఎలికట్టెలో ప్రైవేట్ పాఠశాల వాహనాల అడ్డగింత

- తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని గ్రామస్తుల నిర్ణయం



ఎలికట్టెలో ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డగిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

చిట్యాల: విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరుతూ చిట్యాల మండలం ఎలికట్టె గ్రామవాసులు, పలువురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డగించారు. ఎలికట్టె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 34, ప్రాథమిక పాఠశాలలో 40మందికి పైగా విద్యార్థులున్నారు. దీంతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఎత్తివేసే పరిస్థితి నెలకొనడంతో ఆ గ్రామ సర్పంచ్ ఉయ్యాల సత్తయ్యగౌడ్, ఎంపీటీసీ గొలనుగోండ దశరథ ఆధ్వర్యంలో గ్రామస్తులు, ప్రస్తుతం ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులంతా గ్రామంలోని విద్యార్థులను తీసుకెళ్లే ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డుకున్నారు. విద్యార్థుందరినీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరారు. గురువారం గ్రామస్తులంతా సమావేశమై గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి



ఎలికట్టె గ్రామంలో అన్ని వసతులతో కూడిన జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలున్నాయి. రెండు పాఠశాలల్లో కలిపి ఎనభై మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామంలోని మరో వంద మందికిపైగా విద్యార్థులు చిట్యాలలోని ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు. దీంతో గ్రామంలో అన్ని వసతులున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసే పరిస్థితి ఉంటుంది. ఇలా జరిగితే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పేదరికం కారణంగా విద్యకు దూరమయ్యే అవకాశం ఉంది.

– గొలనుగొండ దశరథ, ఎంపీటీసీ, ఎలికట్టె

పత్తి పంటలో తెగుళ్లు.. పోషకాల యాజమాన్యం

- కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచనలు

పాడి పంట

త్రిపురారం : పంట మార్పిడి చేయకుండా ఏళ్ల తరబడి పత్తి సాగు చేస్తే పంటకు జింకు, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాల లోపం కనిపిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొంటున్నారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా పత్తి పంటలో తెగుళ్ల ఆశించకుండా పోషకాల యాజమాన్య చర్యలు సకాలంలో చేపట్టాలని సూచిస్తున్నారు.

తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలు

జింక్ లోపం : జింక్ లోపం సోకిన పత్తి పంటలో మొక్క ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతాయి. ఆకులు చిన్నవిగా ముడతలు పడి కణువుల మధ్య దూరం తగ్గుతుంది. మొక్కలు గిడసబారిపోతాయి. దీని నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి ప్రతి 5 రోజులకు రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎకరానికి 20కిలోల జింక్ సల్ఫేట్‌ను భూమిలో వేసి కలియదున్నాలి.



సూక్ష్మదాతు లోపంతో పండు ఆకు తెగులు ఆశించి ఎర్రబారిన పత్తి మొక్కలు



డాక్టర్ శ్రీనివాసరావు

పారా నిల్లు లక్షణాలు : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జిల్లాలో అక్కడక్కడ పత్తి పంటలో పారా నిల్లు లక్షణాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. దీని వల్ల మొక్కలకు పోషకాలు సరిగా అందక సడలిపోయి (ఎండిపోయి) చనిపోతున్నాయి. దీని ద్వారా మొక్కలు సాంద్రత తగ్గి దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. దీని నివారణకు అంతర కృషి చేపట్టి మద్దతుగా హెక్టారుకు 25కేజీ యూరియా, పొటాష్ 10 కేజీల చొప్పున అందించి మొక్కలను కాపాడుకోవాలి. పంటల సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలి.

మెగ్నీషియం లోపం

మెగ్నీషియం దాతువు లోపంతో ముదురు ఆకుల అంచులు పసుపు రంగుగా మారుతాయి. తరువాత ఆకులు ఎర్రబడి రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున మెగ్నీషియం సల్ఫేట్‌ను కలిపి పైరుపై వారం పది రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారీ చేయాలి.